# కథ కంచికి - జమ్మీ పుట్టింటికి!

మాధవి గారికి ఒక్కాగానొక్క కొడుకు. చిన్నప్పట్నుంచీ చాలా గారం చేశారు. గారంలో తప్ప అన్నింట్లో వెనకపడి పోయాడు! గ్రాడ్యుయేట్ అయ్యాడు. కామర్స్ కొంతవరకూ వంటబట్టింది! కంతకి తగ్గ బొంతలాంటి, ఉద్యోగం ఒకటి వచ్చింది! యుక్త వయస్సు కూడా దానంతట అదే వచ్చింది. పెళ్ళి చేస్తే, భార్య అండతో దూసుకుపోయే లక్షణం అలవడుతుందన్న ఆశతో, సంబంధాలు చూడడం మొదలు పెట్టారు. పెంపుడుకుక్కగల ఓ చలాకీ పిల్ల వధువుగా నిర్ణయింపబడింది!

పెళ్ళి తంతు జరుగుతున్నంతసేపూ, ఆ పెంపుడు కుక్క, అటూ ఇటూ తిరుగుతూ, మగపెళ్ళివారి హడావిడిని మరపింప చేసింది! పురోహితుని ఉత్తరీయం రెండుసార్లు నోట కరుచుకుపోయింది! పెళ్ళి తంతు జరుగుతూన్నంతసేపూ చి॥ల॥సౌ॥ శోభతో ఉంది! ఆఖరికి, గృహప్రవేశ సమయంలో, వరుడు, ప్రకాశ్‌తో పాటు ఈ శునకం కూడా, శోభతోనే ఉండి శోభిల్లింది! గడప దగ్గర పేర్లు చెప్పమన్నప్పుడు, శోభ "జమ్మీ బావా" నేనూ, వచ్చాం!" అని తన  కుక్కని తీసుకుని యింట్లో ప్రవేశించింది.

అక్కడే ఉన్న పురోహితుడు, "వరుడిపేరు ప్రకాశ్ అన్నారు కదా, మధ్యలో, ఈ 'జమ్మీ బావ" ఎవరూ అని ఆశ్చర్యపోతూ అడిగాడు. వెంటనే వధువు తల్లి, "జమ్మీ అంటే మా అమ్మాయి పెంపుడు కుక్క, పంతులుగారూ! ఈ కుక్క అంటే మా అమ్మాయికి ప్రాణం! దానికి ఒంట్లో బాగాలేక, ఏమీ తినకపోతే మా అమ్మాయి ముద్ద ముట్టేదికాదు! అది తనతోపాటు లేకుండా పెళ్ళిచేసుకోనని పట్టు పట్టింది! ఆఖరికి దీన్ని అత్తారింటికి కూడా తీసుకువెళతానని ఒకటే మారాం చేస్తోంది! మా అమ్మాయికి మేనబావలు లేకపోవడం వలన ఈ కుక్కలో, ఓ మేనబావని చూసూకుంటూ, "బావా" అని పిలుస్తూ, ముచ్చట పడుతోంది.

పురోహితుడు తన శిష్యుని చెవిలో "యిప్పుడు చూడు! ఈ కుక్క నా చేతికి చిక్కింది! ఇందాకా పెళ్ళి తంతు జరిగేటప్పుడు రెండు సార్లు నా ఉత్తరీయం లాక్కుపోయింది! పైగా  నా ముందుకొచ్చి నా మొహం కేసి చులకనగా చూసింది. దీనికి శృంగభంగం ఎలా చేస్తానో చూడు!" అన్నాడు.

"శృంగభంగం అంటున్నారు, కుక్కకి కొమ్ములుండవు కదా గురువుగారూ!" అన్నాడు శిష్యుడు. "సర్లే! నోరు మూసుకుని కూర్చో! కుక్కలకి కొమ్ములూ ఉండవ్, నీలాంటి వాళ్ళకి బుర్రా ఉండదు" అన్నారు, గురువుగారు.

పెళ్ళి మంత్రాలు చదివేటప్పుడు, తన ఉత్తరీయ్యం రెండు సార్లు నోట కరచుకు

పోయిదని మంటగా ఉన్న, పురోహితుడు, "వరుడు పేరు చెప్పకుండా, ఓ కుక్కపేరు, పైగా దానికి "బావా" కూడా తగిలించి చెప్పడం, మహాదోషం! నేను యిప్పటికి చాలా పెళ్ళిళ్ళు చేయించాను కాని, యిటువంటి చేదు అనుభవం ఎక్కడా తటస్థించలేదు. దోష పరిహారార్థం, ఓ రెండు రోజులు పోయిన తర్వాత, ఈ కుక్కకి, "వపన సంస్కారం" చేయించి, సున్నపుబొట్లు పెట్టిదాన్ని సిద్ధం చెయ్యండి. అన్నాడు పురోహితుడు, వరుని తండ్రితో.

"వపన సంస్కారం" అంటే ఏమిటని వధువు తన తల్లిని అడిగింది. దాని జుట్టు కత్తితో గీయించడం అని తెలుసుకున్న చి॥ల॥సౌ॥ శోభ, ఏడుపు లంకించుకుంది.

ఇవన్నీ చూసిన మాధవికి మతిపోయింది. పదహారు రోజుల పండుగలలోపులో, ఈ "వపన సంస్కారం" జరగవలసి వచ్చినందుకు బాధపడింది. వియ్యపురాలితో, "మేము సనాతన సాంప్రదాయాలు కలిగిన వాళ్ళం! దయచేసి, ఈ వపన సంస్కార కార్యక్రమం మీ యింట్లో జరిపించండి, వదినా!" అంది, మాధవి.

మధ్యలో, శోభ అడ్డుపడి, "వపన సంస్కారానికి, నేను ఒప్పుకోను" అంది.

ఎలాగైనా ఆ కుక్కపై కొంత ప్రతీకారం తీర్చుకోవాలని, ఓ అయిదు కత్తెరలు వేయించమన్నాడు, పురోహితుడు.

శోభ తన శునకంతో సహా కాపరానికి వచ్చేసింది! పొద్దున్నే తనకి కాఫీ ఆలస్యమయినా సహించేది కాని, తన జమ్మీకి పాలు ఆలస్యమైతే, అగ్గిమీద గుగ్గిలమై పోయేది!

మాధవి గారు, ఓ శుక్రవారంనాడు, పూజ చేసుకుంటూంటే, అక్కడ అక్కడ దేవుని నైవేద్యానికి చేసుకొన్న పాలు తాగేసి "ఏం! చేసుకుంటావా చేసుకో" అన్నట్లు రెండు కాళ్ళూ పైకెత్తేసి విలాసంగా, నాట్యం చెయడం మొదలు పెట్టింది, జమ్మీ. దేవునికని సిద్ధం చేసిన పాలు తాగేసేసరికి, మాధవికి సహనం నశించింది! పూజ ఆరోజుకి చాలించేశింది.

తన కోడలు కాపరానికి వచ్చిన తర్వాత, పాపం మాధవి నిత్యపూజలు కుంటుపడ్డాయి! ఏనాడో చేసిన పాపాలవల్ల, మృత్యు దేవతలాంటి ఈ "జమ్మీ" ప్రాప్తించినందుకు బాధపడింది!

ఏమైతే అయిందని తన వియ్యపురాలికి ఫోన్ చేసి, తన గోడు చెప్పుకుంది. మాధవి వియ్యపురాలు ఓ రచయిత్రి! ఆమె పేరు కల్పన కాదు గాని మంచి సాహితీ కల్పనా శక్తిగలది. రాతలోగాని సంభాషణా క్రమంలో గాని తను చెప్పే విషయాలు నిజమే కాబోలు అన్నంత నమ్మకంగా చెప్పగల నేర్పరి! తన ప్రతిభ మాధవి మీద ప్రయోగించింది.

"వదినా! ఆ "జమ్మీ" దేవునికి నైవేద్యం పెట్టవలసిన పాలు తాగేసిందని బాధపడకు! దేవుడు సర్వాంతర్యామి అన్ని జీవులలోనూ ఉంటాడు. దశావతరాలలో 'వరాహం' ఒకటన్న విషయం నీకు తెలియనిది కాదు. నువ్ మంచి మనస్సుతో ఏకాగ్రంగా పూజలు చెయ్యడం వలన, నువ్ నైవేద్యం పెట్టకుండానే ఆ పాలు 'ఆ దేవుడు జమ్మీ ద్వారా స్వీకరించాడు. అసలు మనింట్లో చాలా పాలు చాలా ఉండి ఉంటాయ్! మరి, ఆ పూజా గదిలోని పాలే ఆ జమ్మీ ఎందుకు స్వీకరించిందో, కొంచెం కూల్‌గా ఆలోచిస్తే, నీకే అర్థమవుతుంది! పైగా, నీకు సతీసక్కుబాయి చరిత్ర తెలిసే ఉంటుంది! "పాండు రంగ భక్త బృందం" తన యింటికి ముందు నుంచి వెళుతూంటే తన భర్తకి కూడా. చెప్పకుండా, వీధి తలుపు తెరచి ఉన్నా, అన్నం కుక్కలు తినేస్తాయోమోనన్న ఆలోచన కూడా లేకుండా ఆ బృందంతో వెళ్ళిపోయింది అంటే సతీసక్కుబాయి దృష్టిలో కూడా కుక్కలు అంత పవిత్రమైనవి.

ఈ విషయాలు వినిన మాధవి మతి కొంచెం చెలించింది. తను తర్వాత మాట్లాడతానని ఫోన్ పెట్టేసింది.

ఓ శనివారం పొద్దున్నే లేచి, ఆ ఏడుకొండల స్వామి పూజ శ్రద్ధగా చేద్దామని, తన కొడుకుని నిద్ర లేపి, "తన పూజవేళలో ఆ కుక్క తనని బాధపెట్టకుండా చూడమని చెపుదాం కదా" అని, వాళ్ళ బెడ్‌రూమ్ తలుపు కొడదామని చూసింది, మాధవి. అప్పటికే ఆ బెడ్‌రూమ్ తలుపు కొంచెం తెరిచే వుంది. ఆ గదిలోకి తొంగి చూసిన ఆదిలక్ష్మికి కడుపు తరుక్కుపోయే దృశ్యం కనపడింది! తన గారాల కొడుకు నేలపై పడుకున్నాడు! కోడలి పెంపుడు కుక్క, కొడుకు పడుకోవలసిన మంచం మీద పడుక్కుని ఉంది! ఇక, తన కొడుకుని నిద్ర లేపడం మానేసి, పూజకి ఉపక్రమించింది మాధవి.

తర్వాత, తన కొడుకుని, "నలమహారాజు"లా నేలపై పడుకున్నావేమిట్రా!" నాయినా "అని మాతృ వాత్సల్యంలో అడిగింది మాధవి.

"ఏం చెయ్యమంటావు, అమ్మా! ఆ మంచం వాళ్ళిద్దరిదీ! నేను అక్కడ పడుకుంటే గోళ్ళతో గీరుతోంది, ఆ జమ్మీ!" అన్నాడు, అమాయకపు ప్రకాశ్.

ఈ విషయాలు అన్నీ, తన వియ్యపురాలికి వివరించి, ఆ జమ్మీని వెనక్కి తీసుకుపొమ్మంది, మాధవి.

"అదేమిటి వదినా! అన్నెం పున్నెం ఎరుగని ఆ జమ్మీని వెనక్కి పంపిచేస్తావా, మహాపాపం!"అంది వియ్యపురాలు.

"మహాపాపమైనా, నా కొడుకు సుఖం గురించి అనుభవిస్తాను. జమ్మీని వెనక్కి తీసుకుపోయి, పుణ్యం కట్టుకో వదినా!"

ఆఖరికి ఆ మాధవి వియ్యపురాలు పుణ్యం సంపాదించుకుంది!